క్లుప్తంగా

బీఆర్‌ఎస్ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి



మాజీ మంత్రి సబితారెడ్డిని కలిసిన గోవర్ధన్‌రెడ్డి, నాయకులు

శంకర్‌పల్లి: బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో బీఆర్‌ఎస్ పార్టీకి మళ్లీ పూర్వవైభవం తీసుకొస్తానని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా త్వరలో పెద్దఎత్తున మండల సమావేశం నిర్వహించి, నాయకులు, కార్యకర్తల్లో జోష్ నింపుతామని స్పష్టం చేశారు. తర్వాత గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను గూర్చి వివరిస్తామన్నారు.

పరామర్శ



భీమయ్యయాదవ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గున్న భీమయ్యయాదవ్ కుమారుడు గున్న మల్లేశ్‌యాదవ్ అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ గ్రామానికి చేరుకొని భీమయ్యయాదవ్‌ను పరామర్శించారు. అతని కుమారుడి మృతికి సంతాపాన్ని తెలియజేశారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం కల్పించారు. ఆయన వెంట జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీటీసీల సంఘం మండల మాజీ అధ్యక్షుడు బీష్వ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

మొయినాబాద్‌రూరల్: విద్య చదవడం, నేర్చుకోవడంలో వయస్సుకు పరిమితం లేదని, పట్టుదల, కృషి ఉంటే దేనినైనా సాధించగలరని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కులపతి డాక్టర్ సీ.హెచ్.వీ.పురుషోత్తంరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డిలు పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో గల ఆ యూనివర్సిటీలో వాణిజ్య, వ్యాపార నిర్వహణ విభాగంలో ఇంపాక్ట్ ఆర్గనైజేషన్ క్లైమెట్ ఆఫ్ ఆర్గనైజేషన్ అనే అంశంపై ప్రొఫెసర్ కృష్ణమాచారి పర్యవేక్షణలో పి.మేఘశ్యామల పరిశోధన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో పి.శ్యామలకు యూనివర్సిటీ కులపతి పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డిలు ఆమెకు డాక్టరేట్ పట్టాను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డితో పాటు ఆచార్య కిష్టఫర్, రవీందర్, జగదీశ్వర్, ప్రతాప్, రాజు, అధ్యాపకులు, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదె రాంబాబు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా



చండీయాగం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి తదితరులు

కడ్తాల్: దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదపడతాయని, ఆధ్యాత్మిక చింతన అలవర్చుకున్న వారి జీవనం ఆనందమయంగా కొనసాగుతుందని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా అన్నారు. మండల కేంద్రంలో బుధవారం గంగాపురం పీఠాధిపతి పరమాత్మనంద గిరి స్వామిజీ పర్యటించారు. ఈ సందర్భంగా నవంబర్ 15 నుంచి 17 వరకు గంగాపురం ఆశ్రమంలో రెండురోజుల పాటు నిర్వహించనున్న శ్రీరుద్ర సహిత శత చండీయాగం సన్నాహక సమావేశం నిర్వహించారు. యాగం విజయవంతంపై భక్తులతో చర్చించారు. కార్యక్రమ కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పీఠాధిపతిని స్థానికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆశ్రమ ఇన్‌చార్జి వెంకటచరణ గురుస్వామి, స్థానికులు గంప రాములు, అంజయ్య, మల్లప్ప, రాము, మోహన్, వీరేంద్ర, సాయిరెడ్డి, చెన్నయ్య, పద్మాకర్‌రెడ్డి, హరి తదితరులు ఉన్నారు.

ప్రయాణికుల అగచాట్లు

- నాగర్‌గూడ బస్టాండ్‌లో వసతులు కరువు
- నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు, మూత్రశాలలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



నాగర్‌గూడ బస్‌స్టేషన్

షాబాద్: నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస వసతులు కరువవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి బస్టాండ్ ప్రాంగణం, ఆవరణలో సమస్యలతో ప్రయాణికులు సతమతమవుతున్నా పట్టించుకునే నాథులే లేరు. లక్షలు ఖర్చుపెట్టి నిర్మించిన నాగర్‌గూడ బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌లోకి రావడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ బస్టాండ్ నుంచి చేవెళ్ల, షాద్‌నగర్, శంషాబాద్ పలు బస్సు సర్వీసులు నడుపుతున్నారు.

సమస్యలు తిష్ట

మండల పరిధిలోని నాగర్‌గూడలో సుమారు 20 ఏళ్ల క్రితం ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. బస్టాండ్‌లో నీటి సౌకర్యం లేకపోవడంతో పాటు టాయిలెట్లు, మూత్రశాలలు నిరుపయోగంగా మారి నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌లోకి రావడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ బస్టాండ్ నుంచి చేవెళ్ల, షాద్‌నగర్, శంషాబాద్ పలు బస్సు సర్వీసులు నడుపుతున్నారు. బస్‌స్టేషన్‌లో కూర్చోవడానికి సీట్లు లేవు. బస్టాండ్ ఆవరణలో గుంతలు ఏర్పడడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఈ బస్టాండ్‌కు పూడూర్ మండలం కడ్మూర్ నుంచి, చేవెళ్ల మండలం దేవరంపల్లి నుంచి, షాబాద్ మండలం హైతాబాద్ నుంచి 25 గ్రామాల ప్రజలు ప్రతిరోజూ వస్తుంటారు. విద్యార్థులు కళాశాలలకు వెళ్లేందుకు ఈ బస్‌స్టేషన్‌కే రావాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి బస్‌స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలి. ప్రతిరోజు వందలాది మంది ప్రజలు ఈ బస్టాండ్ నుంచి రాకపోకలు కొనసాగిస్తారు. సమస్యల పరిష్కారానికి అధికారులు మాత్రం కృషి చేయడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. వర్షం పడిందంటే బస్టాండ్ పూర్తిగా బురదమయంగా మారుతోంది. ప్రయాణికులు నిలబడడానికి కూడా కష్టంగా మారింది. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌లోకి రాకుండా రోడ్లపైనే నిలబడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వృథాగా మినీ వాటర్ ట్యాంకు



నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు, మూత్రశాలలు

మౌలిక వసతులు కల్పించాలి



మండల పరిధిలోని నాగర్‌గూడ బస్టాండ్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేక అవస్థలు పడాల్సి వస్తోంది. మౌలిక వసతులు లేకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్‌కు రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలి.

–ముక్తార్, నాగర్‌గూడ

మరమ్మతులు చేపట్టాలి



బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు, ప్రభుత్వం మరమ్మతులు చేపట్టి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. ప్రతి నిత్యం ప్రయాణికులు చేవెళ్ల, షాబాద్, శంషాబాద్, షాద్‌నగర్, హైదరాబాద్ వెళ్లేందుకు ఇక్కడికే రావాలి. ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

–మద్దూరు మల్లేశ్,
సహకార సంఘం వైస్ చైర్మన్, షాబాద్

సమయానుకూలంగా బస్సులు నడపాలి

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రోడ్డెక్కిన విద్యార్థులు



చేవెళ్లలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న విద్యార్థులు

చేవెళ్ల: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ సర్వీసులను పెంచి ప్రతీ గ్రామానికి బస్సులు నడిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బి.అరుణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బస్సు సర్వీస్లు పెంచాలని కోరుతూ విద్యార్థులతో రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే సమయాలకనుగుణంగా బస్సులను నడిపించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థులకు సరైన బస్సు సౌకర్యాలు లేక నానాఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని గ్రామాలకు బస్సుల సౌకర్యాలు లేక విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్తున్నారన్నారు. చేవెళ్ల మండలంలోని బస్‌స్టేషన్ సాయంత్రం అయిందంటే చాలా విద్యార్థులతో నిండిపోతుందని, బస్సులు లేక వచ్చిన వాటిల్లో కిక్కిరిసి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇలా ఎన్నో రోజులుగా జరుగుతున్నా అధికారులు, ప్రభుత్వం స్పందించటం లేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఇప్పుడు బస్సుల సమస్య మరింతగా పెరిగిందన్నారు. సమయానికి బస్సులు రావటం లేదని, వచ్చిన కొన్ని బస్సులు సరిపోవటం లేదని వాపోయారు. ఈ విషయం ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచి సమయం ప్రకారం నడిపించాలని కోరారు. చేవెళ్లలోని హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాతో రోడ్డుపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అనంతరం ఆర్టీసీ అధికారులతో వారు ఫోన్‌లో మాట్లాడారు. బస్సులను సమయానుకూలంగా పంపటంతో పాటు బస్సుల సంఖ్య పెంపునకు కృషి చేస్తామని వారు హామీ నివ్వటంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బి.తేజ, సాయి, గణేశ్, చరణ్‌గౌడ్, సమీర్, చందు, నవీన్, సందీప్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేత



మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు అందిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఈ నెల 25న హైదరాబాద్‌లోని సీడీఎంఏ ఆఫీస్ ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టింది. బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ధర్నా నోటీసును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందజేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, జీవో నం.1037లో ప్రతిపాదనలు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు రమేశ్, రాములు, శాంతయ్య, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

కీళ్ల సమస్యలపై అవగాహన



రోగులతో జిమ్స్ ఆస్పత్రి వైద్యులు

కేశంపేట: మండల పరిధిలోని సంగెం గ్రామంలో బుధవారం జిమ్స్ ఆస్పత్రి, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పిల్లల ఎముకలు, కీళ్ల సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గ్రామ పంచాయతీ భవనం వద్ద గర్భిణులు, బాలింతలకు కీళ్ల సమస్యలపై వైద్యులు పలు సలహాలను అందించారు. కాల్షియం లోపంతో ఎముకల రుగ్మతలు వస్తాయన్నారు. ఎముకలు, కీళ్ల సంబంధిత లక్షణాలను పరీక్షల ద్వారా గుర్తించి తగిన చికిత్సలను పొందాలని వారు తెలిపారు. కార్యక్రమంలో జిమ్స్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సమీరా, డాక్టర్ సుచి, డాక్టర్ లహరి, డాక్టర్ రుబియా, డాక్టర్ అభినయ, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ శమంత, అంగన్‌వాడీ టీచర్లు శశికళ, శివలీల, గ్రామ మాజీ ఉప సర్పంచ్ కుమ్మరి శ్రీనివాసులు, ఏఎన్‌ఎం వీణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కొందుర్గు: చౌదరిగూడ మండలంలోని జిల్లేడ్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పతంజలి, ఉపాధ్యాయురాలు జ్యోతిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. సందర్భంగా మాజీ సర్పంచ్ బాబురావు మాట్లాడుతూ.. ఆరు సంవత్సరాలుగా వారు విద్యార్థులకు అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రజిత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి, శ్రీదేవి, సంధ్య, గ్రామస్తులు, నవీన్, బాల్‌రాజ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దుచేయాలి



హెచ్‌ఎంకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: చౌదరిగూడ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేయాలని గ్రామస్తులు బుధవారం పాఠశాల హెచ్‌ఎం సునితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యావ్యవస్థ కుంటుపడుతుందని, ఉన్న ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వెళ్తే విద్యార్థుల చదువు ఏమవుతుందని ప్రశ్నించారు. తెలుగు ఉపాధ్యాయురాలు శైలజ హైదరాబాద్ వనస్థలిపురం పాఠశాలకు డిప్యూటేషన్ ఆర్డర్ తెచ్చుకోవడం బాధాకరమన్నారు. వెంటనే ఆమె డిప్యూటేషన్ రద్దుచేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ నాగరాణి, గ్రామస్తులు జబ్బార్, నర్సింగ్‌రావు, నరేందర్, గిరి, శేఖర్, యాదయ్య, రాములక్ష్మణ్ పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగరవేయడమే లక్ష్యం



ఖానాపూర్‌లో సభ్యత్వ నమోదులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం

చేవెళ్ల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం అన్నారు. మండలంలోని రేగడిఘనాపూర్, ఖానాపూర్ గ్రామాల్లో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చేవెళ్లలో బీజేపీ మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ నిర్దేశించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈనెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. ప్రతీ బూత్‌స్థాయిలో 200ల సభ్యత్వ నమోదు లక్ష్యంను పూర్తిచేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అన్ని స్థానాల్లో పోటీచేసి గెలుపొందాలన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో విఫలమైందని విమర్శించారు. వచ్చే ప్రభుత్వం బీజేపీయేనన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు అంజనేయులుగౌడ్, వైభవ్‌రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు దేవుని శర్వలింగం, కృష్ణాగౌడ్, నాయకులు ఇంద్రాసేనారెడ్డి, శంకర్, కృష్ణ, ఆయా గ్రామాల నాయకులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



మొయినాబాద్: చిలుకూరులో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి అహ్మద్

మండల పశువైద్యాధికారి అహ్మద్

మొయినాబాద్: పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో బుధవారం గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని 196 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి పశువులకు రోగాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందు జాగ్రత్త చర్యగా టీకాలు, మందులు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పద్మ, ప్రసన్నకుమార్, భీమ్‌రావ్, గోరేమియా, గోపాల మిత్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: కేసారంలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ స్రవంతి

షాబాద్: పాడిరైతులు పశుపోషణలో తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కేసారం, నాగర్‌కుంట గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బలరామ్, బాల్‌రాజ్, కృష్ణ, శ్రీకాంత్, రాణి, తదితరులు ఉన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోండి

సీఎస్ శాంతికుమారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే నర్సింలు

షాద్‌నగర్ రూరల్: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు నియామవళిని ఉల్లంఘిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు, పాటు కాల్వలు కబ్జాకు గురవుతున్నా నీటి పారుదలశాఖ, రెవెన్యూశాఖ అధికారులు మౌనం వహిస్తున్నారన్నారు. లింగారెడ్డిగూడ సమీపంలోని కానుగులకుంట పరిధిలో ఓ రియల్ వ్యాపారి కల్వర్టుకు అడ్డంగా గోడ నిర్మించినా అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారని ఆరోపించారు. ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు వాస్తవాలకు వ్యతిరేకంగా తప్పుడు రిపోర్టులను ఇచ్చారన్నారు. రియల్ వ్యాపారి నిర్మించిన అక్రమ నిర్మాణాలు నేటికీ అదేవిధంగా ఉన్నా అధికారులు స్పందించడం లేదని వాపోయారు. ఎలికట్ట శివారులోని లాడెం చెరువు అలుగు పారడంతో వరద నీరు వాగుద్వారా బొబ్బిలి, అప్పారెడ్డిగూడ, నర్సప్పగూడ చెరువులకు చేరుకొని అక్కడి నుంచి హిమాయత్‌సాగర్‌కు చేరుతుందని పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఇరిగేషన్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఎలికట్ట శివారులోని వాగులో రియల్ వెంచర్ కోసం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారన్నారు. విద్యుత్ స్తంభాలను బఫర్‌జోన్‌లో పాతడంతో ఇటీవల కురిసిన వర్షాలకు అవి కొట్టుకుపోయాయని తెలిపారు. తాత్కాలికంగా పనులను నిలిపివేసిన విద్యుత్‌శాఖ డీఈ శ్యాంసుందర్‌రెడ్డి తిరిగి రాత్రి వేళల్లో స్తంభాలను పాతి విద్యుత్ లైన్ వేశారన్నారు. ఇరిగేషన్ అనుమతులు లేకుండా తిరిగి విద్యుత్ స్తంభాలను ఎందుకు ఏర్పాటు చేశారో తెలుసుకునేందుకు ప్రయత్నించగా సదరు అధికారులు స్పందించలేదని వేదన వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు నిబంధనలను ఉల్లంఘించిన ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన విద్య అందించాలి

తలకొండపల్లి: విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధి చుక్కాపూర్ ప్రాథమిక పాఠశాలకు వీరబొమ్మ నారాయణ, లింగమ్మల జ్ఞాపకార్థం లయన్స్ సభ్యులు భిక్షపతి, రామ్మోహన్‌లు రూ.6వేల విలువైన వాటర్ ట్యాంకును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండుకు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తరగతి గదిలోనే దేశ భవిష్యత్ ఇమిడి ఉంటుందన్నారు. ప్రతిభ గల నిరుపేద విద్యార్థులను మా దృష్టికి తీసుకురావాలని, వారి ఉన్నత చదువులకు తగిన విధంగా ఆర్థిక సహాయం అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో లయన్స్ కో–ఆర్డినేటర్ రామ్‌రెడ్డి, జిల్లా చైర్మన్‌లు ఎం.చంద్రశేఖర్, ఎం.అంజయ్యగుప్తా, ఓంకారం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.